## అనాది అడవి వాలకం

పట్నవాసపు పొరుగునే పరిఢవిల్లిన "చెంచుపేట" లోని చెంచు జాతి యొక్క చిన్నందాలు, చిందులు నవనాగరికతతో కూడినవై, ఆ గుబ్బెతలు "చెంచెతలు" అని అనుకోడానికి వీలు లేదన్నంత తెనుగుమీటి పోయారు. వాళ్ళ ముసిలి అవ్వల్ని వెదురు తవ్వల్ని తప్పిస్తిమా!

క్రమంగా ఆ నగరంలో ఒక వోర "చెంచుపేట" అనే పేరట ఒక మునిసిపల్‌వార్డు ఏర్పాటు కాబడి, ఆ కాపురాలున్న వాళ్ళకు వయోజన వోటు, విద్యుద్దీపపునీటు సమకూర్చబడ్డాయి. వాళ్ళంతట వాళ్ళే తొలుత అక్రమంగా ఆక్రమణ గావించిన ఆవరణలో వీధులు తీర్చుకొని ఇండ్లు కట్టుకొని ఎక్కడనుంచి వారక్కడకు వచ్చిందీ, అనగా వారియొక్క చరిత్రనుకూడా విస్మరించి వెల్లడి ప్రజ అయినారు. సినీమా భవనముందటి "క్యూ" లో గాని రైల్వే బుక్కింగు బొట్టికడ "వే" లో గాని వాళ్ళ ఎమ్మలాడిగాని, త్రిమ్మరీడుగాని నిలబడ్డారా తక్కిన వాండ్లకూ వాండ్లకూ వేషభాషల్లో ఎంతమాత్రం తేడాకనబోము. వాళ్లన్నూ "అప్‌టుడేట్" వాళ్ళేను అని మనం అనుకోవలసిందే!

ఎందుకూ! ఇంతగా వ్రాస్తూ నా కథల్లోని పాత్రల నెంతో పోల్చి దిరీసు దేఖీగా చెప్పగల నేను ఆనాడు ఆ చిన్నది దాల్చిన "అంగదట్టం" "బోరబోడిస్" ఏ రంగువో ఏ ధాతుగలవో చెప్పలేకుండా వున్నాను. పైకి పద్దెనిమిదేండ్ల పడుచుపిల్ల, చెవల్ని లోలాకు లూగుతున్నాయి. చక్కని జంపర్ మోపింది.

సరిగ సన్నంగల చీర ముచ్చెంవట్లగా కుచ్చెళ్ళుపోసి కట్టింది. అపర "హాలీవుడ్" తారలా కనుబొమలకు "మేక్ అప్" ఇచ్చింది. సిగలో కనకాంబరాలు చుట్టింది. కుండీలో మొక్క కేనాడు పురిషెడు నీళ్ళుపోయకపోతే ఆనాడే ఏలాగు వాడి పోతుందో ఆలాగే ఆ కుఱ్ఱదినీ్న ఏనాడు ఒక కప్పు కాఫీ త్రాక్క పోతే ఆనాడే నాసిగా కనబడుతుంది.

ఆ పిల్లయొక్క "అండర్ వేర్" ను గురించే వర్ణించలేని వాణ్ణి దాని క్రింద వుండియున్న గుండెకాయ యొక్క గుట్టూ మట్టూ బయటపెట్టగలనా ? నేను లేను ! లేను !

దరిమిలాను ఒక రోజున ఆ సుందరి తన యింటిముందు ముస్తాబై నిలబడి ఇటూ అటూ చూస్తూవుంది. ఒక గడుమన్నెపు మనిషి "బియ్యంపాలెం" "మొసలికుంట" ఆ ప్రాంతంవాడు, పశుప్రాయుడే కానిండు, ఎలప్రాయుడు, దారిమార్గంగా తగని చూపులు చూచుకుంటూ ఆ వీధే ఒకానొక బికారివానిలా గోచీ పెట్టుకుని, పోతూ పోతూ అతిధ్యం కోసమా అన్నట్టు ఆగాడు ఆ ఆడదాని నీడను.

ఆమె వానిని చూస్తూ "ఏ యూరు మీది ?" అని అడిగింది ఊరికేనే ఉబుసుపోక. "మాది మన్నెం" అన్నాడు. అదోఏసతో ఆ ఏస ఆమెను ఆకర్షింపబోలు అదో వింతగా "ఏం ఇలా వచ్చావు ?" అని అడిగింది. "మాం రాలేదు. మమ్మల్ని తరుముకు వచ్చింది ఒకానొక మనుష్యుల్ను తినే పెద్దపులి : నరమాసం తినమరిగిన జంతువు. అది దొరక్కుండా తిరుగుతూవుంది రేత్రింబవళ్ళు మా గూడాల్లో" అని జవాబు చెప్పాడువాడు. "ఏలాగుంటుంది అది ? అని అడిగింది పిల్ల.

"దాని వాక్కొక్క పాదం నాలుగేసి జేనలు. ముఖం చేటంత వుంది, గ్రుడ్లు అగ్గిగుండ్లు. బారలురంగు రంగుల మదత మంచపు పట్టాలు, చట్టలు సానువులు" అంటూ అపురూపంగా వర్ణించాడు, గోళ్ళూ పళ్ళూ మీసాలూ తోక ఇంకా వున్నాయి.

అలా ఆ వయసువాడు అతి భయంకరంగా వర్ణిస్తూవుంటే ఆమెలో అప్రయత్నంగా ఒకానొక పెద్దమార్పు జనించింది. ఆ మార్పునే ఆమెకు పై నాగరీకపు సరిగ పుట్టం పీపీబంధం నుండి విడిపోయింది. "జంపర్" సడలి జబ్బలేన్న జారిపోయింది. దిగుదిరీసు అయిన దళాసరి బొంతకుట్టు గూడకట్టు జాతీయంగా వొంటినంటిపెట్టుక్కా పడుతూ లోకానికి తెలివి గూర్చింది. పలురంగు లెప్పపెప్పటివో!

కోడెకాడు వెంటనే "దొరికావు పిల్లా!" అని అమాంతంగా ఆమెనెత్తుకు ఎగరేసుకు పోయినాడు. "ఎక్కడకు నన్నిలా ఎత్తుకుపోతావు? నేను నీకు ఎందుకు పనికివస్తాను. నీబోటి అనాగరీకుణ్ణి నేను పెండ్లాడను. నీతో నేను కాపురం చేయలేను!" అంది అనుకోని మందస్మితంతో ఆ పిల్ల. "నా గూడానికి. నిన్ను మా అమ్మ నెలుక్కు తెచ్చుకోమంది. అది మంచమెక్కి కూకుంది యీకాడకు మూణ్ణెల్లనుంచి" అన్నాడు వాడు. "మీ అమ్మను ఈ పాటికి "మేన్ ఈటర్" తినేసివుండదూ?" అని అడిగింది పిల్ల ఇంకా హెచ్చుగా నవ్వుతూ. "ఇలాంటి రంగురంగుల గూడకట్టు పెట్టను చూస్తే మనుష్యులను తినే పెద్దపులి మాయమైపోతుంది. అమ్మ కట్టే గూడకట్టూ ఇలాంటిదేను. ఇన్నాళ్ళకు దేశదేశాలు తిరిగి నిన్ను కనుగోగలిగాను. మఱినాకు ఆ మెకం అంటే భయం లేదు"

అన్నాడు వాడు. "నీకు భయం పోవడానికి మీఅమ్మ చాలదూ?" అని అడిగింది పడుచు అదోజాలిగా. "మనం వెళ్ళేసరికి మా అమ్మ జీవాలు వదిలేసి వుంటుంది" అన్నాడు వాడు కళ్ళు చెమర్చుకుంటూ. "పెద్దపులివల్లనే?" అని ప్రశ్నించింది ఆమె. "కాదు స్వభావంగా ముసిలిదై" అన్నాడు వాడు అతి నిబ్బరంగా! దారిలో వారిద్దర్నీ "మేన్ ఈటర్" ఎదుర్కొంది కాని ఆ పిల్లయొక్క అనాది అడవి వాలకం చూస్తూ శాంతంగా పిల్లిలా తప్పుకుంది.

.... .... .... .... ....

## మోటార్ స్టార్టింగ్

స్వేచ్ఛ ఆ దేశంలో విశ్వరూపం దాలుస్తూవున్న, రోజులవి. మగవాళ్ళ స్వేచ్ఛకోసం మగవాళ్ళ క్లబ్బులు, ఆడవాళ్ళ స్వేచ్ఛకోసం ఆడవాళ్ళ క్లబ్బులు, ఏలా విస్తరిల్లి వున్నాయో ఆలాగ్గానే తమకూ ప్రత్యేకించి క్లబ్బులు వుండాలంటూ తల్లిదండ్రుల్ని సాధించి వేధించి, మోది, మొత్తి, మొఱగించి, కరగించి, చిన్న పిల్లలందరూ కలసి ఆమహా పట్నంలో "చిల్డ్రిన్సు క్లబ్బు" ఒకటి సంస్థాపించుకున్నారు. "చిల్డ్రిన్సు క్లబ్బు" లో మళ్ళీ ఆడ, మగ అనే చీలికల్లేవు. అయితేగియితే ముందు రాబోయే క్రొంగ్రొత్త కృతయుగంలోగానీ చీలిక లవ్వాలి. అప్పటిమట్టుకు ఆ పిల్లకాయలందరూ లింగభేదం పాటించకుండా చెట్టాపట్టా లేసుకుంటూ తమ క్లబ్బును నడిపించుకుంటామన్నారు. ఇప్పటి దాకా నిర్విఘ్నంగా కొనసాగించుకొంటూను వచ్చారు.